క్లుప్తంగా

ఆర్థిక సాయం



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ రజాక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మృతుడి బాల్య మిత్రులు బుధవారం పరామర్శించి రూ.30,500 ఆర్థిక సాయం అందజేశారు. చుక్క బాలరాజు, గుత్తికొండ నారాయణ, పులి వెంకటరెడ్డి, ఎండీ అక్బర్, రఫిక్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

కమిటీ ఎన్నిక



కాటారం: మండలంలోని గుండ్రాత్‌పల్లిలో ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని బుధవారం ఎన్నుకున్నట్లు మండల ఇన్‌చార్జ్ చంద్రగిరి అశోక్ తెలిపారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఆతుకూరి రమేశ్, ఉపాధ్యక్షుడిగా కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా దుర్గయ్య, ప్రచార కార్యదర్శిగా మల్లేశ్, అధికార ప్రతినిధిగా శ్రీనివాస్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. నూతన కమిటీకి ఎన్నిక పత్రం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న భూపాలపల్లిలో నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మంథెన చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ మావోయిస్టు మృతి

చిట్యాల: మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్ గ్రామానికి చెందిన మాజీ మావోయిస్టు చింతనిప్పుల దశరథం అనారోగ్యంతో బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. దీంతో అతని మృతదేహానికి జెడ్పీటీసీ గొర్రె సాగర్ నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట కైలాపూర్ సర్పంచ్ చింతల శ్వేత సుమన్, మండల రైతు బంధు కో ఆర్డినేటర్ మడికొండ రవీందర్‌రావు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

టేకుమట్ల(రేగొండ): రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైన సంఘటన రేగొండ మండలంలోని దమ్మన్నపేట వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం చిట్యాల మండల కేంద్రానికి చెందిన చెలిమెల రాజేష్ ద్విచక్ర వాహనంపై పరకాలకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పరకాల నుంచి చిట్యాల వైపునకు వైన్ షాప్ లోడుతో వస్తున్న డీసీఎం వ్యాన్ దమ్మన్నపేట వద్ద ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో రాజేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

కొత్తమల్లూరులో వైద్యశిబిరం

మంగపేట: మండలంలోని బెస్తగూడెం(కొత్త మల్లూరులో) చుంచుపల్లి వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ గ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. ముగ్గురు జ్వరపీడితుల నుంచి రక్తన మూనాలు సేకరించి మలేరియా పరీక్షలు నిర్వహించగా నెగిటీవ్‌గా వచ్చినవందన్నారు. . వైద్య శిబిరంలో పీహెచ్‌ఎన్ శైలజ, హెచ్‌వీ ముత్తమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆలయ కమిటీని ఏర్పాటు చేయాలని వినతి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని అంకన్నగూడెం గ్రామ సమీపంలోని గుడి గుట్టల వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయానికి కమిటీని ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం అంకన్నగూడెం గ్రామస్తులు రామచంద్రాపురం సర్పంచ్ అట్టం సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంజనేయస్వామి ఆలయానికి ఆలయ కమిటీ లేక పోవటం వల్ల ఆలయ నిధులు దుర్వినియోగం అవుతున్నాయని అన్నారు. ఆలయ నిర్వహణ కొన్ని సంవత్సరాలుగా ఒకే వ్యక్తి నిర్వస్తున్నాడని దానివల్ల సక్రమంగా లేకుండా పోయిందని భక్తులకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైన ఆలయానికి కమిటీ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిటిబాబు, చందు, నర్సింహరావు, బుల్లయ్య తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



టేకుమట్ల: వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు



రేగొండలో..

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు, మండలంలోని వెల్లంపల్లిలో పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, అనుమానితులను విచారించి వదిలేశారు. వాహన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. అనంతరం ఎస్సై రాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వాహన పత్రాలను కలిగి ఉండాలని, వాహనదారులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు.

రేగొండలో..

రేగొండ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సై శ్రీకాంత్ రెడ్డి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను తనిఖీ చేసి అనుమానితుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిషేధిత పదార్థాలను వాహనాల్లో తరలిస్తే వాహనాలను సీజ్ చేయడంతో పాటు, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ కానిస్టేబుళ్లు ఉన్నారు.

కాటారం: మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో బుధవారం ఎస్సై–2 తమాషారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ప్రధాన కూడలి మీదుగా వెళ్తున్న వాహనాలను నిలిపి ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానాలు విధించారు. వాహనదారులు తప్పనిసరిగా సరైన వాహన పత్రాలు కలిగి ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలకు పాటించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్సై–2తో పాటు సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

మహాముత్తారం: మండలంలోని యామన్‌పల్లి, నిమ్మగూడెం ప్రధాన రహదారిలో ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. అలాగే కనుకునూర్, రెడ్డిపల్లి నుంచి భూపాలపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సును యామన్‌పల్లి సమీపంలో ఆపి తనిఖీలు నిర్వహించారు. అనుమానితులతో మాట్లాడి బ్యాగులను తనిఖీ చేశారు. రహదారి నుంచి వెళ్లే వాహనదారులతో మాట్లాడి పత్రాలను పరిశీలించారు. ఎస్సై వెంట సీఆర్‌పీఎఫ్ సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.



మహాముత్తారంలో..



మహాముత్తారం: బస్సులో తనిఖీ..



కాటారంలో..

గిఫ్ట్ ఏ స్కూల్ బ్యాగ్..

- స్కూల్ బ్యాగ్ చాలెంజ్ పేరిట సీఆర్పీఎఫ్ జవాన్ వినూత్న కార్యక్రమం



బ్యాగులు అందజేస్తున్న ఎస్సై, జవాన్ మనోహర్

కాటారం: మండలంలోని 58వ బెటాలియన్‌లో సీఆర్పీఎఫ్ జవానుగా పని చేస్తున్న మనోహర్ గత కొంత కాలంగా కాటారం సబ్ డివిజన్ పరిధిలోని పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. ఇదే క్రమంలో పాఠశాలలు ప్రారంభం కావడంతో వారికి స్కూల్ బ్యాగ్‌లు సమకూర్చాలనే ఆలోచనతో స్కూల్ బ్యాగ్ చాలెంజ్ –2023లో భాగంగా గిఫ్ట్ ఏ స్కూల్ బ్యాగ్ అనే విన్నూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పోలీస్, సీఆర్పీఎఫ్‌లో పని చేసే అధికారులు, తోటి జవాన్లు, ఉద్యోగులు, బంధువులు, స్నేహితులకు గిఫ్ట్ ఏ స్కూల్ బ్యాగ్ అని చాలెంజ్‌ను రైజ్ చేస్తూ వారి సాకరంతో బ్యాగులను సేకరించారు. ఛాలెంజ్ ద్వారా దాతల సహకారంతో సమకూర్చిన స్కూల్ బ్యాగ్‌లను బుధవారం కాటారం మండల కేంద్రంలోని గంటగూడెం ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని పేద విద్యార్థులకు అందజేశారు. కాటారం ఎస్సై–2 తమాషారెడ్డి చేతుల మీదుగా 32 మంది విద్యార్థులకు బ్యాగ్‌లను పంపిణీ చేశారు. దాతల సహకారంతో స్కూల్ బ్యాగ్ ఛాలెంజ్ ద్వారా మరికొంత మంది పేద విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు సమకూర్చనున్నట్లు మనోహర్ పేర్కొన్నారు. పేద విద్యార్థులకు తనవంతు తోడ్పాటును అందించడమే బాధ్యతగా ముందుకెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవ యువకులు కొట్టె సతీష్, సందీప్, సుమన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కంపెనీలో పనిచేస్తున్న వేలాది మంది కార్మికుల సమస్యలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని ఈనెల 30న జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఒకరోజు నిరాహార దీక్ష చేయనున్నట్లు తెలిపారు. కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సింగరేణి ఎన్నికల ప్రక్రియ వెంటనే చేపట్టాలని, కారుణ్య నియామకంలో మెడికల్ దందాపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని, మారుపేరుతో పని చేస్తున్న కార్మికులకి ఉద్యోగ అవకాశాల్లో వెసులుబాటు కల్పించాలని దీక్ష చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న సింగరేణి కార్మికులు, యువత అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మోహన్, మధుకర్‌రెడ్డి. సుదర్శన్, రమేష్, ప్రశాంత్, కిరణ్, సుధీర్, శేఖర్‌లు పాల్గొన్నారు.

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభం



భూపాలపల్లి బ్రాంచ్‌ని ప్రారంభించిన కలెక్టర్

భూపాలపల్లి అర్బన్: జిల్లా కేంద్రంలో బుధవారం బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర భూపాలపల్లి బ్రాంచ్‌ని కలెక్టర్ భవేష్ మిశ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర హైదరాబాద్ డిప్యూటీ జోనల్ మేనేజర్ మహ్మద్ షాజీబ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర హైదరాబాద్ జోన్‌లోని జిల్లా కేంద్రంలో 52వ బ్రాంచ్‌ని ప్రారంభించుకున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. దీంతో రాష్ట్రంలో 25 జిల్లాలలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఏర్పడిందని దేశ వ్యాప్తంగా 2,300 బ్రాంచ్‌లు ఏర్పాటు అయ్యాయన్నారు. రిటైలర్స్‌కి తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తుందని 3 ఈఎమ్‌ఐలు ఉచితంగా సులభమైన ప్రాసెసింగ్‌తో ఇంటి రుణాలు, బంగారు రుణాలు తక్కువ వడ్డీతో ఇస్తుందని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం తిరుపతి, బీడీఓ అశోక్ కుమార్, భూపాలపల్లి బ్రాంచ్ మేనేజర్ బి రాజ్‌ప్రసాద్, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలలను పట్టించుకోని ప్రభుత్వం'

భూపాలపల్లి అర్బన్: పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పెండెం మధుసూదన్, కుర్రె ప్రవీణ్‌లు ప్రకటనలో ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించలేదన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టకపోవడంతో పాఠశాలలు అధ్వానంగా ఉన్నాయని వాపోయారు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా చేపట్టడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మొగుళ్లపల్లి: విధులల్లో అంకిత భావంతో పని చేస్తున్న ఉత్తమ ఉద్యోగులను ఎస్‌జీటీయూ మండల అధ్యక్షులు చాగంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని పాఠశాలలో సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి సారంగాపాణి, మొట్లపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నరసింహస్వామిలు హాజరై మాట్లాడారు. రానున్న రోజుల్లో ఉద్యోగులు మరింతగా పని చేసి రాష్ట్ర స్థాయిలో అవార్డులు అందుకోవాలన్నారు. అలాగే ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా ఎంపికైనా మెట్‌పల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలకు చెందిన వకుళభరణం విష్ణుమూర్తి, ఉత్తమ ఉపాధ్యాయురాలిగా వేములపల్లి పాఠశాలకు చెందిన డి.స్వర్ణలత, ఉత్తమ ఎంఆర్సీ ఉద్యోగిగా ఎంపికైన ఆరెల్లి చంద్రమౌళిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి సదానందం, రాజు, నాగేందర్, విజేందర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బహుమతులను అందజేస్తున్న అధికారులు

భూపాలపల్లి అర్బన్: రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం బహుమతులను అందజేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై మంగళవారం క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ మేరకు మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన మండలంలోని గొల్లబుద్దారం ఉన్నత పాఠశాలకు చెందిన ఎం సిరి, సీహెచ్ వైష్ణవికి రూ.5వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన భూపాలపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన అఖిల, హాసినిలకు రూ.4వేలు, పెద్దాపూర్ ఉన్నత పాఠశాలకు చెందిన సాహిత్య, శ్రావణి తృతీయ స్థానంలో నిలవగా రూ.3వేల చొప్పున నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డీఎం తిరుపతి, ఎంఈఓ దేవ నాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంక్‌లో డబ్బులు లేవు!

- ఇబ్బంది పడుతున్న ఖాతాదారులు

టేకుమట్ల: రైతుల ఖాతాల్లో రైతుబంధు నగదు జమకావడంతో పెట్టుబడికి ఇబ్బంది లేకుండా రైతులు బ్యాంక్‌లకు వెళ్లి నగదును తీసుకుంటూ అవసరాలను తీర్చుకుంటున్నారు. కానీ బుధవారం మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌లో నగదు లేవని బ్యాంక్ అధికారులు చెప్పడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితుల్లో బ్యాంక్ మిత్రల కోసం ఎదురు చూశారు వారు కూడా అందుబాటులోకి రాకపోవడంతో ఖాతాదారులు వెనుదిరిగి వెళ్లారు. ఈ విషయంపై స్థానిక ఏపీజీవీబీ మేనేజర్ మంగేష్‌ను వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు.

దాతలు దయ చూపండి..

- గొర్రెలు, గేదెలు అమ్మి డయాలసిస్
- కిడ్నీలు మార్చేందుకు రూ.30 లక్షలు అవసరం
- దాతల కోసం ఎదురుచూపు



ఆస్పత్రి బెడ్‌పై సమ్మయ్య

వాజేడు: మండల పరిధిలోని పేరూరుకు చెందిన అనుముల సమ్మయ్య గొర్రెలు కాసుకుని, వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. కాగా, సంవత్సరం నుంచి సమ్మయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆస్పత్రికి వెళ్లి వైద్యపరీక్షలను చేయించుకోగా రెండు కిడ్నీలు దెబ్బతిన్నట్లు వైద్యులు తెలిపారు. కిడ్నీలు మార్చాలని.. లేదా డయాలసిస్ చేయాలని చెప్పారు. అంతకుముందే డెంగీ జ్వరంతో రూ.2 లక్షలను ఖర్చు చేసి వైద్యం చేయించుకున్నాడు. పరిస్థితి బాగాలేదని భావించి కూతురుకు పెళ్లి చేశాడు. ఇంతలోనే కిడ్నీలు దెబ్బతిన్నట్లు బయటపడింది. కిడ్నీలు మార్చుకునేంత డబ్బులు వారి వద్ద లేవు. దీంతో డయాలసిస్ చేయించుకుంటున్నాడు. గతంలో నెలకు ఒకసారి రెండు సార్లు చేసే డయాలసిస్ ప్రస్తుతం వారానికి నాలుగు సార్లు చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా మారింది. డయాలసిస్ కోసం ఉన్న 50 గొర్రెలు, నాలుగు గేదెలను అమ్మేశాడు. మరో రూ.4 లక్షల వరకు వైద్యం నిమిత్తం అప్పులు చేశాడు. ఇప్పుడు డయాలసిస్ చేసినా ఉపయోగం లేని పరిస్థితికి వచ్చాడు. వైద్యులు కిడ్నీలను మార్చాలని చెప్పినట్లు సమ్మయ్య అతని భార్య సావిత్రి తెలిపారు. ఒక్కో కిడ్నీ మార్చడానికి సుమారుగా రూ.15 లక్షల దాకా(కొనడానికి, మార్చడానికి) ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపినట్లు వాపోయారు. కాగా, కిడ్నీలను మార్చుకోవడానికి చేతిలో డబ్బులు లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నాడు. వైద్యం చేయించుకోవడానికి, ఒక్క కిడ్నీ నైనా మార్చు కోవడానికి దాతలు సహకరించాలని సమ్మయ్య, అతడి భార్య సావిత్రి వేడుకుంటున్నారు.

దాతలు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్
మల్లికార్జున్(సమ్మయ్య కుమారుడు)
ఫోన్ పే, గూగుల్ పే
81212 40510

నాణ్యమైన విద్య అందించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పంతకాని సమ్మయ్య

కాటారం: విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలని ఎంపీపీ పంతకాని సమ్మయ్య ఉపాధ్యాయులకు సూచించారు. కాటారం మండలంలోని చిద్నెపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల సంఖ్య, విద్యాబోధన తదితర అంశాలపై ఆరా తీశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో సౌకర్యాలు, శిథిలావస్థకు చేరుకొని నిరూపయోగంగా మారిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఒకే గదిలో ఐదు తరగతులు నిర్వహించాల్సి వస్తుందని ప్రధానోపాధ్యాయులు సురేశ్ ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎంపీపీ భవన మరమ్మతులకు మండల పరిషత్ ద్వారా రూ.2లక్షల ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ మహేశ్ రవీందర్‌రావు, నాయకులు కుమ్మరి అశోక్, గద్దం కొంరయ్య ఉన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి



మాట్లాడుతున్న చిటమట రఘు

ఏటూరునాగారం: యువత రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు, యువకులకు కాంగ్రెస్ పార్టీ మీకు ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. అలాగే ప్రతి ఒక్కరిని స్వేచ్ఛాయుతంగా కాంగ్రెస్ పార్టీ ఆహ్వానిస్తుందని అన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులను, అమరవీరుల కుటుంబాలను సీఎం కేసీఆర్ మోసం చేశారన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాలు లేక అల్లాడుతున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అసెంబ్లీ కోర్డినేటర్ ఇర్సవడ్ల వెంకన్న, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ అయూబ్ ఖాన్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, ఎంపీటీసీ గుడ్ల శ్రీలతదేవేందర్, జిల్లా మైనారిటీ సీనియర్ నాయకులు ఖలీల్ ఖాన్, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ప్రధాన కార్యదర్శి వావిలాల చిన్న ఎల్లయ్య, మహిళా మండల అధ్యక్షురాలు, ఉపసర్పంచ్ కర్ల అరుణ, అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, జిల్లా మహిళా నాయకురాలు కట్కూరి రాధిక, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి కొండగొర్ల పోషయ్య, సరికొప్పుల

లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలి

ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెంలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని సర్పంచ్ దొడ్డ కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని రామన్నగూడెం అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అశ్రీనాతో కలిసి తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు సమయపాలన పాటించాలన్నారు. ఇటీవల కోడి గుడ్లు పాడైపోవడంతో పలువురు లబ్ధిదారులు ఐసీడీఎస్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో సూపర్‌వైజర్‌తో కలిసి గుడ్లను పరిశీలించామన్నారు. సెంటర్ల వారిగా ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఎస్ హెడ్మాస్టర్ స్వర్ణలత, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ



నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

భూపాలపల్లి అర్బన్: మండలంలోని ఆముదాలపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ప్రేమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు నిమ్మల దశరథం మాట్లాడుతూ.. మారుమూల ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకు సాయం చేసి వారిని చదువులో ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, స్టేషనరి వస్తువులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు చల్ల సంపత్, ఫౌండేషన్ సభ్యులు క్యాతం అనిల్‌కుమార్, సౌజన్య, సుకన్య, మాలతి, దేవేందర్, నరేష్, సమ్మయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

టేకుమట్ల(గోరికొత్తపల్లి): భూపాలపల్లిలో ఈ నెల 30న నిర్వహించే ఎమ్మార్పీఎస్ సన్నాహక సభను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ మండల ఇన్‌చార్జ్ నోముల శ్రీనివాస్ అన్నారు. బుధవారం గోరికొత్తపల్లిలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ సీనియర్ నాయకుడు భట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణలో కేంద్ర ప్రభుత్వం దళితులను మోసం చేసిందని, ఎన్నికల సమయంలో ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని నమ్మబలికి నేడు ఎస్సీ వర్గీకరణను పాతరేశారని మండిపడ్డారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణకు కలిసికట్టుగా పోరాటం చేసేందుకు మాదిగ, మాదిగ ఉప కులాలు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పుల్యాల రాంబాబు, జూపాక అశోక్, ఈర్ల సదానందం, మొగిళి, దుర్గయ్య, రమేష్, రజినీకాంత్, మొగిళి, శ్యాం, రాజేష్, పవన్, భాస్కర్, రాజేం

దర్గా పరిసరాల్లో మద్యం సీసాలు!



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని సయ్యద్ మహమూద్‌షావలీ (ఎర్ర ఘోరి) దర్గా మందుబాబులకు అడ్డాగా మారింది. దర్గా వెనుకాల ఖాళీ స్థలంలో మందుబాబులు అర్ధరాత్రి వరకు మద్యం సేవించి ఖాళీ సీసాలు వదిలి పారేస్తున్నారు. దర్గా వెనుకాల చిందర వందరగా పడేయడంతో దర్గాకు వచ్చే భక్తులు ఇబ్బందిగా మారినట్లు పలువురు వాపోతున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు గస్తీ పెంచి మందుబాబులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.